క్లుప్తంగా

నియామకం
నర్సంపేట : జాతీయ బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట టౌన్ కమిటీ ఉపాధ్యక్షుడుగా చీర వెంకటనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్యగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారపు నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, టౌన్ కమిటీ అధ్యక్షుడు గండు రవి, ప్రధాన కార్యదర్శి సాంబరాతి మల్లేశం, జిల్లా అధికార ప్రతినిధి పంజాల వెంకట్, డివిజన్ అధికార ప్రతినిధి లింగయ్య, నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఫోరం’ కన్వీనర్‌గా..
ఖానాపురం : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని బుధరావుపేటకు చెందిన నందగిరి రజనీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రజనీకాంత్‌కు రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు.

కమిటీ ఎన్నిక
సంగెం : శ్రీ సంఘమేశ్వర బ్యాండ్ కళాకారుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మద్దికుంట్ల యాదగిరి కమిటీకి ధృవీకరణ పత్రం అందజేశారు. వివరాలు వెల్లడించారు. గౌరవ అధ్యక్షుడిగా నంగునూరి శంకర్, అధ్యక్షుడుగా పోడేటి రాజు, ఉపాధ్యక్షుడిగా కొర్ర బాలు, కార్యదర్శిగా మునుకుంట్ల రవి, కోశాధికారిగా పాషా, సలహాదారుగా మునుకుంట్ల కొమురయ్య, సభ్యులుగా కందుల కుమారస్వామి, వెలిశాల రవి, హాజీమియా, బానోత్ లక్‌పతి, కొత్తగట్టు నాగేందర్, నాగవెల్లి పూర్ణ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా అడ్‌హక్ కమిటీ నాయకులు దొడ్డపల్లి భిక్షపతి, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు వెండి బాబు తదితరులు పాల్గొన్నారు.

దాడులను ఖండించాలి
నర్సంపేట : బంగ్లాదేశ్‌లో హిందులపై జరుగుతున్న దాడులను సమాజంలోని ప్రతిఒక్కరూ ఖండించాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మోతె సమ్మిరెడ్డి కోరారు. బంగ్లాదేశ్‌లో దాడులను నిరసిస్తూ పట్టణంలో బుధవారం నిర్వహించిన నిరసనా ర్యాలీలో ఉపాధ్యక్షురాలు అంద్రు వనజ, వీహెచ్‌పీ కార్యదర్శి వేల్పుల శ్రీధర్‌తో కలిసి సమ్మిరెడ్డి పాల్గొని మాట్లాడారు. స్వామి చిన్మయ దాస్‌ను వెంటనే విడుదల చేయాలని, ఆలయాలపై దాడులను నివారించాలని డిమాండ్ చేశారు.

‘న్యాయం చేయండి’
వర్ధన్నపేట : తనకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని ఓ యువతి వేడుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన బాధిత యువతి దీపిక విలేకరుల ఎదుట బుధవారం గోడు వెళ్లబోసుకుంది. తనకు ఆరేళ్ల క్రితం చెన్నారావుపేట మండలంలోని బాపునగర్‌కు చెందిన శ్రావణ్‌తో వివాహం అయిందని, ఇద్దరు పిల్లలు కలిగారని చెప్పారు. కొంత కాలంగా తన భర్త వేరే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను తల్లిగారి ఇంటి వద్ద వదిలేశాడని తెలిపింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం చేయడం లేదని చెప్పింది.

సన్మానం
వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లికి చెందిన జన్ను రాములు మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన్ను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వర్ధన్నపేటలో బుధవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడారు. మాదిగల ఐక్యత కోసం కృషి చేస్తానన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యే వరకు ఉద్యమాలు చేపడతామని చెప్పారు. తనను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మరుపట్ల అంజయ్య, జన్ను నర్సయ్య, జక్కి శ్రీకాంత్, కంజర్ల మహేశ్, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని కేజీబీవీలో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ లెక్చరర్‌గా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేనక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బాటనీ (వృక్షశాస్త్రం) బోధించడానికి పీజీ, బీఈడీ అర్హత కలిగిన యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన వ్యక్తులు ఈనెల 5 నుంచి 9వ తేదీలోపు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తుతోపాటు ఆధార్, ఫొటో, సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. వేతనం నెలకు రూ.23 వేలు ఉంటుందని వివరించారు.

పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి
రాయపర్తి : పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి కోరారు. మండలానికి చెందిన ఐదుగురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తొర్రూరులో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చేతుల మీదుగా బుధవారం ఇప్పించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, ఉల్లెంగుల యాదగిరి, బాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

‘భోజన’ బిల్లులు రాక వెతలు

- అప్పుల పాలవుతున్న నిర్వాహకులు
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

సంగెం : మధ్యాహ్న భోజన బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. నెలల తరబడిగా బిల్లులు పెండింగ్‌లో పెడుతుండడంతో నిర్వాహకులు అప్పుల పాలవుతున్న దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో 2 వేల 103 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 790 మంది 9, 10వ తరగతుల విద్యార్థులు కాగా 80 మంది వంట కార్మికులు గౌరవ వేతనం పొందుతూ వంట చేసి పెడుతున్నారు. వీరికి మార్చి నుంచి గౌరవ వేతనం పెండింగ్‌లో ఉంది. అలాగే 1 నుంచి 5వ తరగతుల విద్యార్థులకు భోజనం అందించే నిర్వాహకులకు అక్టోబర్ నుంచి, 6 నుంచి 8 తరగతుల భోజన నిర్వాహకులకు సెప్టెంబర్ నుంచి, 9 ,10 తరగతుల విద్యార్థులకు భోజనం అందిస్తున్న వారికి ఆగస్టు నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉంది. కోడి గుడ్డు బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో నిర్వాహకులకు కాస్త గిట్టుబాటు అవుతున్నా తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో కనీసం కూలి గిట్టుబాటు కావడం లేదు. ఇదిలా ఉండగా సకాలంలో బిల్లులు రాకపోవడం, సరుకుల ధరలు పెరగడంతో కిరాణ సామగ్రి, కోడిగుడ్లు, కూరగాయల కోసం అప్పులు పెరిగిపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు, గౌరవ వేతనం ప్రతినెలా సకాలంలో చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు, నిర్వాహకులు కోరుతున్నారు.

ఐదు నెలలుగా పెండింగ్

ఐదు నెలలుగా భోజన, కోడి గుడ్ల బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం. అప్పు చేసి భోజనం వడ్డిస్తున్నాం. నగలు, ఆస్తులు కుదువ పెట్టి సరుకులు, కోడిగుడ్లు కొనుగోలు చేస్తున్నాం. అప్పులు పెరిగిపోవడంతో షాపుల వాళ్లు సరుకులు ఇవ్వట్లేదు. ప్రతినెలా బిల్లులు చెల్లించాలి.
– షాహెదా, మధ్యాహ్న భోజన కార్మికురాలు

బిల్లులు పంపిస్తున్నాం

మధ్యాహ్న భోజన బిల్లులు ఎప్పటికప్పుడు ట్రెజరీకి పంపిస్తున్నాం. నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించే దిశగా చొరవ తీసుకుంటున్నాం. త్వరలో బకాయి బిల్లులు అందుతాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తాం.
– బి.రాము, ఎంఈఓ, సంగెం

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దాతలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో అర్చకుడు దేవేశ్ మిశ్రా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకరి సుప్రియ సంతోశ్‌రెడ్డి, మామిడి పద్మ సదానందం, దేశ రాధిక సంపత్, రుద్రాన్ష్, కొప్పు సుమతి సుధాకర్, తాళ్లపల్లి బండారి వెన్నెల, ఆరుషి, అజయ్‌కుమార్ కవిత, ఆలేటి ధైవిక్, ప్రమోద్‌రెడ్డి, ఆలేఖ్య అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి వెలగించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మినారాయణ, పిన్నా రామనాథం, శింగిరికొండ వేణుగోపాల్, ఆకుల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


సుదర్శన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

‘పంబా ఆరట్టు’కు ఆహ్వానం
నల్లబెల్లి : నర్సంపేటలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న పంబా ఆరట్టు మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి సేవా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ట్రస్ట్ ప్రతినిధులు సుదర్శన్‌రెడ్డిని మండల కేంద్రంలోని నివాసంలో బుధవారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సింగిరికొండ మాధవ శంకర్ మాట్లాడారు. అయ్యప్ప భక్తుడిగా 21 ఏళ్లుగా పంబా ఆరట్టు దాతగా సుదర్శన్‌రెడ్డి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పైస సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూముపై గుంత

- మొరం పోయించిన అధికారులు


గుంతను పూడుస్తున్న అధికారులు

సంగెం : మండల కేంద్రంలోని ఊరచెరువు కట్ట మిట్టతూముపై గుంత ఏర్పడింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి కట్టపై ఏర్పడిన గుంతను బుధవారం రైతులు గమనించారు. కాగా ఐబీ డీఈ గణేశ్, ఏఈ హమీద్ పరిశీలించి భూకంపంతోనే గుంత ఏర్పడిందని చెప్పడంతో పలువురు ఆశ్చర్యపోయారు. భూకంపంతో ఎక్కడా ఎలాంటి నష్టం వాటిల్లనప్పుడు కట్టపై గుంత ఏర్పడడం ఏమిటని ప్రశ్నించారు. 2008లో ఇదేవిధంగా గుంత పడి తూము పూడుకుపోయిందని, అందులో రాళ్లు, మొరం పోయించి పూడ్చివేశామని అప్పటి నీటి సంఘం చైర్మన్ తాటికొండ కిష్టయ్య తెలిపారు. అదే చోట ఇప్పుడు గుంత ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో ‘సాక్షి’ దినపత్రికలో ‘అధికారుల నిర్లక్ష్యం–రైతులకు నష్టం’ శీర్షిన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు తూము మరమ్మతు కోసం ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన తర్వాత పనులు చేస్తామని తెలిపారు. ఇప్పుడు జేసీబీతో చదును చేసి మొరం పోసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. రబీ పంటల అనంతరం తూమును మరమ్మతు చేస్తామని ఐబీ డీఈ గణేశ్ తెలిపారు.

గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం


పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, ఉమ్మడి వరంగల్ జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. చెన్నారావుపేట, ఉప్పరపల్లి పశు వైద్యాధికారులు మంజీలాల్, రాధిక 136 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స చేసి మందులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆడదూడలను పుట్టించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లింగ నిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సెమెన్ పశు వైద్యశాలల్లో, గోపాల మిత్రల వద్ద అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పాడిరైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ జహంగీర్, గోపాల మిత్రలు కళ్లెపు ప్రసాద్, లక్ష్మినారాయణ, రమేశ్, మధూకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

- ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం

దుగ్గొండి : పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా హమాలీల కూలి రెట్లు పెంచాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని గిర్నిబావి బస్టాండ్ సెంటర్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. గతంలో యాజమాన్యాలతో హమాలీ కార్మికులు చేసుకున్న రేట్ల ఒప్పందం ఈనెల 21తో ముగియనుందని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. విద్య, వైద్యం, తదితర కనీస సౌకర్యాలు అందని ద్రాక్షగా మారాయని ఆందోళన వెలిబుచ్చారు. హమాలీ కూలి పాత రేట్లపై 50 శాతం పెంచడంతోపాటు ధాన్యం దిగుమతికి ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి హమాలీ కార్మికుల కూలి పెంచడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సీపతి పోశాలు, రవికుమార్, చిరంజీవి, కొమురయ్య, కట్టయ్య, బాబు, ఐలయ్య, మల్లేశ్, రాములు, సదానందం, మహిపాల్, లింగన్న, మాస కుమార్, రాజశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- జేఏసీ అధ్యక్షుడు నర్మెట్ట యాదగిరి

చెన్నారావుపేట : సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ అధ్యక్షుడు నర్మెట్ట యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎంఈఓ సరళకు బుధవారం సమ్మె నోటీసు అందజేసింది. అనంతరం యాదగిరి మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని చెప్పారు. ఈనెల 6, 7 తేదీల్లో జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తామని, నుంచి నిరవధిక సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి పోరిక సుజాత, సభ్యులు స్వప్న, అశోక్, సంపత్, స్వామి, బాలు, శిల్ప, ఇందిర, ఉమ, సరిత, భార్గవి, స్వప్న, కమల, సుమలత, రాజ్యలక్ష్మి, పల్లవి, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పసుల కార్తీక్, ముడుసు రమేశ్ ఆధ్వర్యంలో ఎంఈఓ రత్నమాలకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం కార్తీక్, రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, జ్యోతి, అంజయ్య, రజిత, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సదుపాయాలు వినియోగించుకోవాలి
పర్వతగిరి : దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని ఎంఈఓ గాయపు లింగారెడ్డి కోరారు. మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ వికలాంగుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలకు ప్రభుత్వం ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ పాక రమేశ్ బాబు, ఐఈఆర్‌పీ అశోక్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శిల్ప, సీసీఓ గారె జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

‘దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి’
గీసుకొండ : కాంగ్రెస్ ఏడాది పాలనపై సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ కోరారు. మండలంలోని మచ్చాపూర్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అవగాహన లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈనెల 7న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు ఇంటి స్థలాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు దూల వెంకటేశ్వర్లు, కూసం రమేశ్, మంద రమేశ్, లక్కర్సు రవి, వీరభద్రం, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : చార్జ్‌షీట్ విడుదల చేస్తున్న రమేశ్, తదితరులు


నర్సంపేట : చార్జ్‌షీట్ విడుదల చేస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి, తదితరులు


మోసపూరిత పాలన... ఉత్సవాలు విడ్డూరం

- బీజేపీ నేత అరూరి రమేశ్

వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలతో గారడీ చేస్తూ మోసపూరిత పాలన సాగించి ఉత్సవాలు నిర్వహిస్తుండడం విడ్డూరంగా ఉందని బీజేపీ నేత అరూరి రమేశ్, ఆ పార్టీ అనుబంధ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. ఏడాది పాలనలో వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై మండలంలోని ఇల్లందలో నియోజకవర్గ అసెంబ్లీ యాత్ర ప్రముఖ్ బన్న ప్రభాకర్ అధ్యక్షతన చార్జ్‌షీట్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేశ్, శ్రీధర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి తదనంతరం అన్నిటినీ విస్మరించిందని తెలిపారు. మెనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను అమలు చేయలేదన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. గురుకులాల్లో, పాఠశాలల్లో అందిస్తున్న భోజనంలో నాణ్యత లోపించి విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. ఏడాది పాలనలో ఎమ్మెల్యే నాగరాజు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వన్నాల వెంకటరమణ, పట్టాపురం ఏకాంతం, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, మల్లాడి తిరుపతిరెడ్డి, రాయపురం కుమారస్వామి, జలగం రంజిత్, బుద్ధ శ్రీనివాస్, జడ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం
నర్సంపేట : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో నియోజకవర్గ యాత్ర ప్రముఖ్ కట్ల రామచంద్రారెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ఏడాది పాలనలోని వైఫల్యాలపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో మిర్చి పరిశోధక కేంద్రం ఏర్పాటు చేస్తామన్న హామీ ముగ్గురు ఎమ్మెల్యేలు మారినా నెరవేరలేదన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, నియోజకవర్గ నేత కంభంపాటి పుల్లారావు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, అజ్మీర శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గుడిపూడి రాధాకృష్ణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భానోతు వీరన్న, జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

నర్సంపేట : పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా డీఆర్ఓ రీనా అభివర్ణించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ–వన్య ప్రాణి సంరక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించగా శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు హాజరు కాగా వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడారు. పర్యావరణాన్ని రక్షించకుంటే మానవ మనుగడకే ప్రమాదం అని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్‌రావు మాట్లాడుతూ బాల్యం నుంచే మొక్కలు నాటి సంరక్షించడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని చెప్పారు.

స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత

నెక్కొండ : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో చదువుతున్న 145 మంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు వంగర లక్ష్మణ్ బాల్యమిత్రుడు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జుత్తి కిరణ్‌కుమార్ సమకూర్చిన స్పోర్ట్స్ మెటీరియల్‌ను ఎంఈఓ రత్నమాల ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. అనంతరం ఎంఈఓ రత్నమాల మాట్లాడారు. ప్రతిఒక్కరూ దానగుణం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రంగరావు, ఉపాధ్యాయులు ఇక్బాల్, శ్రీదేవి, వినయ్‌కుమార్, ఇమ్మానియేల్, నర్సయ్య, వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, విజయలక్ష్మి, సుధాకర్, ఉమ, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధనే ధ్యేయం

- జిల్లా ఏఎంఓ సుజన్ తేజ


భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఎంఓ సుజన్‌తేజ

ఖానాపురం : విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించడమే ధ్యేయంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షలు నిర్వహించి విద్యాప్రమాణాలను అంచనా వేయనున్నట్లు జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) సుజన్ తేజ తెలిపారు. మండలంలోని కేజీబీవీని, బుధరావుపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎన్ఏఎస్ పరీక్షను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను గుర్తించి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి పరీక్షలు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, హెచ్ఎంలు నాగేశ్వర్‌రావు, పద్మావతి, జయశ్రీ, దివ్య, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 1987–88 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు నర్సంపేటలోని గ్రీన్ రిసార్ట్‌లో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాన్ని ఏర్పాటు చేసుకొని స్నేహితులతో కలిసి ఆరగించారు. ఉద్యోగం, కుటుంబం, తదితర విషయాలు స్నేహితులతో పంచుకున్నారు. అనంతరం నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, లింగయ్య, జగదీశ్వర్, రుషి, వలబోజు రవి, మామిడి వీరయ్య, భద్రయ్యలను శాలువాతో ఘనంగా సన్మానించి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగిశెట్టి ప్రసాద్, అందె యాదగిరి, భూపతి వీరన్న, అడ్డగట్ల రమేశ్, శివకుమార్, సోమేశ్వర్, ఉడుగుల రాజమౌళి, ఉరుల శ్రీనివాసు, దాసరి శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, పసునూరి శ్రీనివాస్, షరీఫ్, మోరె రమేశ్, అందె మురళి, నల్లబెల్లి సాంబయ్య, సంపత్‌కుమార్, సాయి, లింగాపురం పేరయ్య, శంకర్, నర్సయ్య, రమేశ్, గోపాల్, పెండ్లి కనకయ్య, చింతకింది రాజమణి, సుమతి, జ్యోతి, రజియా, సరోజన, రేణుక, రమ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు
చెన్నారావుపేట : ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దని ఏడీఏ దామోదర్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి కొనుగోళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి మాట్లాడారు. తేమ శాతం 17 ఉంటే వెంటనే కాంటా నిర్వహించాలని చెప్పారు. రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు.

నివాళి
ఖానాపురం : మండలంలోని కొత్తూరుకు చెందిన మాజీ సర్పంచ్ బాష బోయిన చంద్రయ్య (59) బుధవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు అశోక్ యాదవ్, కొమ్మాలు, బాలునాయక్, సదర్‌లాల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.